కఠిన శిక్షలు పడేలా చట్టాలు చేయాలి



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనతో మహిళల భద్రతపై సందేహాలు కలుగుతున్నాయి. ముఖ్యంగా మహిళా వైద్యులపై తరచూ దాడులు జరుగుతూనే ఉన్నాయి. వైద్యులపై దాడులకు తెగబడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలు రావాలి. రాత్రి సమయాలలో డ్యూటీలు చేసే మహిళా వైద్యులకు తగిన భద్రత కల్పించాలి.

– డాక్టర్ ప్రసన్నరాణి, మండల వైద్యాధికారి, జి.కొండూరు



కాలయాపన చేయకుండా శిక్షించాలి



మహిళలపై దాడులకు తెగబడి హత్యలు చేస్తున్న నిందితులపై కాలయాపన చేయకుండా వెంటనే కఠిన శిక్షలు అమలు చేయాలి. ఇప్పుడిప్పుడే మహిళలు అన్ని రంగాల్లో ఎదుగుతున్నారు. కోల్‌కతా లాంటి ఘటనల వల్ల మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడే డాక్టర్లపై ఇటువంటి దాడులు జరగకుండా కఠిన చట్టాలు రావాలి. మహిళపై చేయి వేయాలంటే భయపడేలా శిక్షలు అమలు చేయాలి.

– కోయ సుధ, యునైటెడ్ హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మైలవరం

క్లుప్తంగా

సామూహిక కుంకుమార్చన



మెట్టగుట్ట(గంపలగూడెం): శ్రావణ శుక్రవారం సందర్భంగా పెనుగొలను శివారు మెట్టగుట్టపై శేషాచల శ్రీనివాసస్వామి ఆలయ ప్రాంగణంలోని గజలక్ష్మీ దేవికి సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు యోగానందాచార్యులు, శ్యామసుందరాచార్యుల ఆధ్వర్యంలో తొలుత శేషాచల శ్రీనివాసమూర్తికి ప్రత్యేక పూజలు జరిగాయి.

● గంపలగూడెం: శ్రావణ శుక్రవారం సందర్భంగా గంపలగూడెం ముత్యాలమ్మ గుడిలో గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం గ్రామ దేవతకు వివిధ రంగుల చీరలు, ఆభరణాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

మంత్రి కొలుసు పార్థసారథి



నూజివీడు: ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మండలం బోర్వంచలో మసీదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో శుక్రవారం మంత్రి పార్థసారథి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి అన్నివిధాలా అండగా నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బర్మా ఫణి బాబు, టీడీపీ నాయకులు రియాజ్ ఖాద్రి, పాషాఖాద్రి, ముస్నీ, రిజ్వాన్, అబ్దుల్ మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీల్లో రక్షణ చర్యలు చేపట్టాలని నిరసన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల రక్షణ చర్యలు చేపట్టాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ కోరారు. అచ్చుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో 18 మంది మరణించడంపై కొండపల్లి ఐడీఏలోని ఫార్మా కంపెనీల వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అచ్చుతాపురం కంపెనీలో 18 మంది కార్మికులు మరణించడం బాధాకరమన్నారు. ప్రమాల్లో ప్రభుత్వం, కంపెనీల యాజమాన్యాల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీల్లో భద్రతా చర్యలు చేపట్టి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్టీటీపీఎస్‌లో తరుచూ జరుగుతున్న ప్రమాదాలకు యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ఎ.కొండూరు: కిడ్నీ బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. చీమలపాడు, రామచంద్రాపురం, లక్ష్మీపురం, చైతన్యనగర్, మధ్య తండా, ఎ.కొండూరు తండా, కుమ్మరి కుంట్ల, గొల్లమందల, కంభంపాడు గ్రామాల్లో శుక్రవారం సీపీఎం నాయకులు పర్యటించారు. కిడ్నీ బాధిత కుటుంబాలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించి వారి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో వైద్య శిబిరాలు



ముసునూరు: జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని పీహెచ్‌సీ పరిధిలోని కొర్లగుంట, బలివే, చింతలవల్లి గ్రామాల్లో శుక్రవారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, జ్వరాలపై సర్వేలు చేస్తున్నామని ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షకీనా ఇవాంజిలిన్ తెలిపారు. శిబిరాల్లో 156 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, ఐదుగురికి సాధారణ జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి డెంగీ, మలేరియా టెస్ట్‌లు చేయగా నెగెటివ్ వచ్చాయని, గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. వైద్య శిబిరాలను కొద్ది రోజులు కొనసాగిస్తామన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- విజయవాడ ఆర్డీఓ భవానీ శంకర్
- అన్ని చోట్లా గ్రామ సభల నిర్వహణ
- సమస్యలపై చర్చ.. ఉపాధి పనుల గుర్తింపు

జి.కొండూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మంజూరైన నిధులను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని ఆర్డీఓ భవానీ శంకర్ అన్నారు. జి.కొండూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టవలసిన పనులు, నిధుల వినియోగం వంటి అంశాలను భవానీశంకర్ వివరించారు. ఎంపీడీఓ అనూరాధ మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, 25 మినీ గోకులాల నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధుల వినియోగం, ఉపాధి హామీ పనుల గుర్తింపు వంటి అంశాలపై అన్ని గ్రామ పంచాయతీలలో సమావేశాలు నిర్వహించి చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నరసాపురం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

నరసాపురం(విస్సన్నపేట): అందరి సమన్వయంతో నరసాపురం గ్రామాన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నరసాపురం గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న పనుల గుర్తింపునకు జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ నాగమణి అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరూ సమన్వయంతో తమ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి ఉపయోగకరమైన పనులు చేపట్టాలన్నారు. తొలుత జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డీడీ ఫిషరీస్ వి. పెద్దిబాబు, ఏపీడీ పార్థసారథి, ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఏపీఓ అనురాధ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం..

చంద్రాల(మైలవరం): గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పన, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గంగాధరరావు అన్నారు. చంద్రాల పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీహరి, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. చంద్రగూడెం, వెల్వడం, చంద్రగూడెం, మొర్సుమల్లిలో గ్రామ సభలు నిర్వహించారు.



నరసాపురం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పనుల గుర్తింపునకే గ్రామ సభలు

తిరువూరు రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న పనులను గుర్తించి ఆమోదం పొందేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తిరువూరు ఆర్డీఓ మాధవి తెలిపారు. తిరువూరు మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను శుక్రవారం నిర్వహించారు. లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో నిర్వహించేందుకు అవకాశం ఉన్న 82 రకాల పనులను వివరించారు. ప్రజా సమస్యలపై ప్రణాళిక రూపొందించేందుకు ఈ సభల్లో ప్రతిపాదించాల్సి ఉందన్నారు. ఎంపీడీఓ నాగేశ్వరరావు, సర్పంచ్ గొల్లమందల శ్రీనివాస్, సెక్రటరీ రవికాంత్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● ఎ.కొండూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు ఏపీఓ జే. రామారావు తెలిపారు. ఎ.కొండూరు మండలంలోని 21 గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు 8.33 మీటర్లు వేయటానికి రూ. 5 కోట్లతో అంచనాలు వేసి ఆమోదించామని చెప్పారు. చేపట్టనున్న పనులపై చర్చించి గ్రామసభల్లో ఆమోదించారు. ఈఓపీఆర్డీ పరమాత్మ, తహసీల్దార్ బి. ఆశ య్య, జెడ్పీటీసీ గనియా, అధికారులు పాల్గొన్నారు.

● రెడ్డిగూడెం(మైలవరం): రెడ్డిగూడెం పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ పలు అంశాలపై చర్చించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● నూజివీడు: మండలంలోని మిట్టగూడెం, పడమర దిగవల్లి, బోర్వంచలో నిర్వహించిన ఉపాధిహామీ గ్రామ సభల్లో మండల ప్రత్యేకాధికారి ఎస్.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, వ్యవసాయ భూములకు వెళ్లే రోడ్లను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఎంపీడీఓ పీఏ విజయ్‌కుమార్, సర్పంచ్‌లు కెత్తే నాని, నరసింహారావు, ఉదయరాజు, ఆలూరు చాముండేశ్వరి, పాల్గొన్నారు.



జి.కొండూరు గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ భవానీ శంకర్



లక్ష్మీపురం సభలో మాట్లాడుతున్న తిరువూరు ఆర్డీఓ మాధవి

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

ఆగిరిపల్లి: రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడు గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు ప్రధాన అంశాలపై చర్చించి గ్రామ నిర్మాణానికి ముందడుగు వేయాలన్నారు. సర్పంచ్ యలమర్తి కిరణ్మయి, తహసిల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ శంకరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు ఆమోదం

చాట్రాయి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఆయా గ్రామాల్లో చేపట్టనున్న పనులకు శుక్రవారం నిర్వహించిన గ్రామ సభల్లో ఆమోదం లభించింది. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 2024- 25 సంవత్సరంలో చేపట్టే పంట కాలువలు, ఫీడర్ చానల్, చెరువు గట్లు బలిష్టం, పూడికతీత, ఉద్యానవన తోటల్లో వంట కుంటలు వంటి పనులను గుర్తించి కూలీల సమక్షంలో అధికారులు ఆమోదం తెలిపారు. బూరుగుగూడెంలో సభలో అధికారి బ్రహ్మచారి, ఎంపీడీఓ దుర్గాప్రసాద్, ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

● భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని సచివాలయం వద్ద శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో చేస్తున్న పనులు ప్రజలకు తెలిసేలా సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డ్‌ను ఏర్పాటు చేశారు. గొల్లపూడి స్పెషల్ ఆఫీసర్ బీఎల్‌వీ శేషగిరిరావు అధ్యక్షతన జరిగిన సభలో ఉపాధి పనుల గుర్తింపుపై చర్చించారు. పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామస్తులు లేని గ్రామ సభలు నిరర్థకం



గంపలగూడెం: ఉపాధి హామీ పథకం పనులతో పాటు, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికకు ఆమోదం పొందేందుకు ఏర్పాటు చేసిన గ్రామ సభలకు గ్రామస్తులు హాజరుకాని పరిస్థితిలో సభల నిర్వహణ నిరర్థకమని, ప్రభుత్వ ఆశయం నెరవేరదని గంపలగూడెం మండల ప్రత్యేకాధికారి వెంకటనారాయణ అన్నారు. గంపలగూడెం మండలంలోని 24 పంచాయతీల్లో శుక్రవారం అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. గంపలగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సభలో ప్రత్యేకాధికారి మాట్లాడుతూ గ్రామ సభల్లో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది మాత్రమే కనిపించడంపై అసహనం వ్యక్తంచేశారు. గ్రామ అవసరాలను గుర్తించి ప్రజామోదంతో ప్రణాళిక తయారు చేయడమే లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారని, అలాంటి సభలకు కూడా ప్రజలు హాజరై తమ సమస్యలను చెప్పుకోలేని పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సర్పంచ్ కోట పుల్లమ్మ, ఎంపీడీఓ చెన్నయ్య, గ్రామ ప్రత్యేకాధికారి, ఈఓపీఆర్డీ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచా యతీ ఈఓ జి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

9 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు

జి.కొండూరు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు సెప్టెంబరు 9 నుంచి 12వ తేదీ వరకు స్థానిక శాగం శివరామిరెడ్డి జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సీజర్‌రెడ్డి అన్నారు. పోటీల నిర్వహణ నియమావళిపై చర్చించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు స్థానిక జెడ్పీ హైస్కూల్లో సీజర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణ, ప్రతిభావంతుల గుర్తింపు వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పీడీలు మార్తమ్మ, సాంబశివరావు, పురుషోత్తం, శ్రీలత, శ్యామల, పీఈటీలు కె. మాధవరావు, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

లక్ష్మమ్మ, అంకమ్మ అమ్మవార్లకు పూజలు

చాట్రాయి: ఆరుగొలనుపేటలో నూతనంగా నిర్మించిన లక్ష్మమ్మ, అంకమ్మ అమ్మవార్ల ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 9వ తేదీన నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి 16 రోజుల పండుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన పలగాని పిచ్చేశ్వరరావు దంపతులు అమ్మవార్లకు బంగారపు కళ్లు, ముక్కు పుడక, ముక్కెరను సమకూర్చారు. మహిళలు అమ్మవార్లకు పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఎంప్లాయీస్ కాలనీ, జంక్షన్ రోడ్డు, ఆర్ఆర్‌పేట, చిన్న గాంధీబొమ్మ సెంటర్, కోనేరుపేట, పాతపేట, రైతు బజారు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అలాగే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సమతా నగర్, బంగినపల్లితోట, ఎన్టీఆర్ కాలనీ, వికాస్ టౌన్‌షిప్, శ్రీనగర్ కాలనీ, రాజీవ్ సర్కిల్, అమ్మవారితోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

టంగుటూరికి ఘన నివాళి

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆర్డీఓ వై.భవానీశంకరి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సైమన్ గోబ్యాక్ ఉద్యమంలో ఆంగ్లేయుల సిపాయిలకు తన గుండెను చూపి కాల్చమని గర్జించిన ధైర్యశాలి ప్రకాశం పంతులు అని చెప్పారు. ఆయన పోరాట పటిమను వివరించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పెనుగొలను(గంపలగూడెం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్రోద్యమంలో, ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ప్రకాశం పంతులు చేసిన సేవలను పలువురు కొనియాడారు. గ్రంథాలయ నిర్వహణాధికారి జె. శ్రీలత, పాఠకులు, షిర్డీ సాయిబాబా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

● జి.కొండూరు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని గంగినేని జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్రోద్యమంలో ప్రకాశం పంతులు పోరాట పటిమ, ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలను పాఠశాల హెచ్‌ఎం జీవీ రామకృష్ణ విద్యార్థులకు వివరించారు.

● రెడ్డిగూడెం(మైలవరం): ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు జి. అనుగ్రహ ప్రసాద్ అన్నారు. రెడ్డిగూడెం మండలం నాగులూరు విజయబాబు కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఉపాధ్యాయిని పి.నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

● తిరువూరు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు ఎన్నటికీ మరువలేనివని తిరువూరు గ్రంథాలయ అధికారి పద్మావతి అన్నారు. తిరువూరు గ్రంథాలయంలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. పాఠకులు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



గంగినేని జెడ్పీ హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ భవానీశంకరి

దోమల లార్వా నిర్మూలనకు చర్యలు

డీఎంహెచ్ఓ సుహాసిని

కాచవరం(ఇబ్రహీంపట్నం): గ్రామాల్లోని డ్రెయినేజీలు, నివాస ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా ఆరోగ్య శాఖాధికారి ఎం.సుహాసిని అన్నారు. కాచవరం పరిధిలోని సత్యనారాయణపురంలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహణను శుక్రవారం ఆమె పరిశీలించారు. నివాస ప్రాంతాల్లోని డబ్బాల్లో నిల్వ ఉన్న నీరు, తాగేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు తదితర వస్తువుల్లో దోమల లార్వాను కనుగొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో దోమల లార్వా నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆరోగ్య సేవలపై రోగుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. పీహెచ్‌సీ వైద్యుడు టి.సుమంత్, సీహెచ్ఓ కేవీఎస్ నారాయణ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సుహాసిని

హెచ్‌ఐవీపై అవగాహనా ర్యాలీ



హెచ్‌ఐవీపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

కోకిలంపాడు(తిరువూరు రూరల్): ప్రాణాంతకరమైన హెచ్‌ఐవీ వ్యాధి బారినపడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇది అంటుకొనే వ్యాధి కాదు.. అంటించుకొనేది అని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్‌వర్కర్ సరిత అన్నారు. కోకిలంపాడులో శుక్రవారం హెచ్‌ఐవీపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఐవీ, సుఖవ్యాధులు ఎలా వ్యాపిస్తాయో వివరించారు. ఎంపీపీ భారతి, సర్పంచ్ మాధవీలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నూజివీడు: సెప్టెంబర్ ఒకటి నుంచి మూడో తేదీ వరకు విశాఖపట్నంలో జరుగనున్న ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. నూజివీడులోని అమర్ భవన్‌లో జాతీయ జనరల్ కౌన్సిల్ సమావేశాల వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

నడకా నరకమే!

జి.కొండూరు: జి.కొండూరు నుంచి గంగినేని వరకు ఉన్న ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. జి.కొండూరు, గడ్డమణుగు, చెర్వు మాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్ల దేవరపాడు, గంగినేని గ్రామాల మీదుగా తెలంగాణ రాష్ట్రాన్ని కలుపుతూ 15 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారి మొత్తం అడుగడుగునా లోతైన గుంతలు ఏర్పడి నడక కూడా నరకంగా మారింది. ఇక వాహనదారుల పరిస్థితి వర్ణనాతీతం. వర్షాలు పడిన సమయంలో గుంతలు నీటితో నిండి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిపై రాత్రి సమయాలలో వెళ్లాలంటే కత్తిమీద సాములా తయారైంది. రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాలకు ప్రత్యామ్నాయ రహదారులు సైతం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి నూతన రహదారిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



మునగపాడు గ్రామ శివారులో గుంతలలో నీరు నిలిచి బురదగా మారిన రహదారి



జి.కొండూరు వద్ద రహదారిపై ఏర్పడిన గుంతలలో నిలిచిన వర్షం నీరు

మురుగు నిల్వ ఉండకుండా చర్యలు

విస్సన్నపేట: ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి శ్రీనివాసరావు అన్నారు. డ్రై డే ఫ్రై డే కార్యక్రమంలో భాగంగా విస్సన్నపేటలో ఇంటింటికి వెళ్లి దోమలు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న నీరు తొలగింపజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాదయాత్ర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

తిరువూరు: ఫ్లోరైడ్, సిలికాన్ బారినుంచి తిరువూరు నియోజకవర్గ ప్రజలను రక్షించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి మూడు రోజులపాటు ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్ర నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య తెలిపారు. తిరువూరు సుంకర వీరభద్రరావు భవనలో శుక్రవారం పాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభానీ, ఎస్కే మీరా, ప్రసాద్ పాల్గొన్నారు.

అప్పు తీర్చమన్నందుకు దాడి

చాట్రాయి: ఇచ్చిన డబ్బులు ఇవ్వమని అడిగినందుకు దాడి చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన మజ్జూరి వెంకటరత్నం వద్ద అదే గ్రామానికి చెందిన బిలుగుది సురేష్ రూ.5 వేలు అప్పుగా తీసుకున్నాడు. శుక్రవారం వెంకటరత్నం మంకొల్లు వెళ్తుండగా పోలవరం శివారు ఎల్లమ్మ గుడి వద్ద సురేష్ కనిపించడంతో తీసుకున్న అప్పుని ఇవ్వమని అడిగాడు. దీంతో దుర్భాషలాడుతూ పక్కనే ఉన్న బీరు సీసాను పగలగొట్టి వెంకటరత్నంపై దాడి చేయడంతో కుడి భుజంపై బలమైన గాయమైంది. నిందితుడిని శనివారం కోర్టులో హాజరుపరుస్తారు.